సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 20 । జూన్ । 2025



టన్ను చీనీ రూ.29,100
అనంతపురం మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.29,100. కనిష్టంగా రూ.3 వేల ప్రకారం ధర పలికాయి.



ఫీజుల మోత
జూన్ వచ్చిందంటే తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరిగెడుతాయి. ప్రైవేటు స్కూళ్లలో అడ్డగోలుగా వసూలు చేసే ఫీజులు భయ పెడుతున్నాయి.

10లో

గరిష్టం/కనిష్టం
36.3°/22.9°

జిల్లా పరిధిలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 16 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

లేపాక్షి హుండీ కానుకల ఆదాయం రూ.8.16 లక్షలు



ఆలయంలో హుండీని లెక్కిస్తున్న దృశ్యం

లేపాక్షి: లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయంలో గురువారం ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ పర్యవేక్షణలో ఈఓ నరసింహమూర్తి ఆధ్వర్యంలో హుండీ కానుకలను లెక్కించారు. హుండీల ద్వారా రూ.8,16,341 ఆదాయం వచ్చిందని చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ నరసింహరాజు, గ్రామ పెద్దలు, భక్తులు, అర్చకులు పాల్గొన్నారు.

సమయ పాలన పాటించాలి



రోగితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ఫైరోజా బేగం

పెనుకొండ రూరల్: సమయ పాలన కచ్చితంగా పాటించాలని జిల్లా వైద్యాధికారిణి ఫైరోజాబేగం వైద్య సిబ్బందిని ఆదేశించారు. మండల పరిధిలోని గుట్టూరు ప్రభుత్వాస్పత్రిని ఆమె ఆకస్మికంగా గురువారం తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఓపీ, వార్డులో ఉన్న రోగులతో వైద్య సదుపాయాలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఫార్మా గదిని పరిశీలించారు. పంపిణీ చేసిన, నిలువ ఉన్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత ఆస్పత్రి ఆవరణలోని పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఫైరోజా బేగం మాట్లాడుతూ.. ఆస్పత్రి పరిసరాలను ఎప్పటికపకప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్యులు నాగరాజు నాయక్, శ్రావణి, సిబ్బంది హాజరయ్యారు.

ప్రభుత్వ బడుల్లో ప్రవేశాల పెంపునకు కృషి



పుట్టపర్తి ఎమ్మార్సీలో ఎంఈఓతో మాట్లాడుతున్న డీఈఓ కృష్ణప్ప

పుట్టపర్తి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తున్నట్టు డీఈఓ కృష్ణప్ప తెలిపారు. ఆయన గురువారం పుట్టపర్తి ఎమ్మార్సీలో రికార్డులను తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు విజయవంతంగా ముగించామని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఏ పాఠశాలలోనూ ఉపాధ్యాయుల కొరత లేకుండా సర్దుబాటు చేశామని పేర్కొన్నారు. ఎక్కడైనా అవసరముంటే ఎంటీఎస్ ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తామని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి ఉత్తీర్ణత శాతాన్ని పెంచే విధంగా ప్రణాళికలు రూపొందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఖాదర్ వలిబాషా, ప్రసాద్, ఉపాధ్యాయుడు ప్రకాష్‌రెడ్డి, ఎమ్మార్సీ సిబ్బంది నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ గురుకులాల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు


అనంతపురం ఎడ్యుకేషన్: శ్రీ సత్యసాయి జిల్లాలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 6-9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు జిల్లా సమన్వయ అధికారి కె.జయలక్ష్మీ తెలిపారు. జిల్లా కార్యాలయం లేదా గురుకుల పాఠశాలల్లో ఈనెల 23లోపు దరఖాస్తులు అందజేయాలన్నారు. అనంతపురం జిల్లాలో ఖాళీలు లేవన్నారు. బాలికలకు హిందూపురం బాలికల పాఠశాల, బాలురకు హిందూపురం బాలుర పాఠశాలల్లో పరీక్షలు ఉంటాయన్నారు.

ఖాళీలు రోస్టర్ వారీగా ఇలా...
6వ తరగతిలో..కాళసముద్రం పాఠశాలలో బీసీ-1, మలుగూరు ఎస్సీ (గ్రూప్-3)-2, నల్లమాడలో ఎస్సీ (గ్రూప్-3)-2, ఎస్టీ-2, ఓసీ-1, అమరాపురంలో ఎస్సీ (గ్రూప్-3)-1, రొళ్లలో ఎస్సీ (గ్రూప్-3)-2, ఓసీ-1 ఖాళీలున్నాయి. అలాగే 7వ తరగతిలో మలుగూరులో ఎస్సీ (గ్రూప్-3)-1, ఎస్టీ-1, అమరాపురంలో ఎస్సీ (గ్రూప్-3)-1, హిందూపురం బాలకల పాఠశాలలో ఎస్సీ (గ్రూప్-3)-3, ఎస్టీ-1, బీసీ-1, రొళ్ల పాఠశాలలో ఎస్టీ-1 ఖాళీలున్నాయి. 9వ తరగతిలో హిందూపురం బాలికల పాఠశాలలో ఎస్సీ (గ్రూప్-3)-1 ఖాళీ ఉందని జయలక్ష్మీ వెల్లడించారు.

కుప్పం ప్రాంతానికి కృష్ణా జలాలను తీసుకెళ్లేందుకు చంద్రబాబు ప్రభుత్వం ఆగమేఘాలపై చేపడుతున్న హంద్రీ-నీవా లైనింగ్ పనులు తెలుగు తమ్ముళ్లకు ఆదాయ వనరుగా మారాయి. తమకు తీవ్ర నష్టం జరుగుతుందని రైతులు వాపోతున్నా సీఎం చంద్రబాబు నిధుల పందేరానికి తెరలేపారు. అసలు లైనింగే వద్దంటుంటే ఆపై నాసిరకంగా పనులు చేస్తూ రూ. కోట్లు కొట్టేస్తున్నారు.

నాణ్యతకు తూట్లు..

జేబుల్లోకి కోట్లు



పంపనూరు వద్ద కార్మికులతో లైనింగ్ పనులు చేపడుతున్న దృశ్యం

- నాసిరకంగా హంద్రీ-నీవా లైనింగ్
- ఇష్టారాజ్యంగా పనులు
- అప్పుడే పలుచోట్ల కంకర తేలిన వైనం
- రైతులు వ్యతిరేకిస్తున్నా లైనింగ్‌కు తెరలేపిన బాబు సర్కారు
- కాంట్రాక్టర్లందరూ టీడీపీ నేతలే

సాక్షి ప్రతినిధి, అనంతపురం/ఆత్మకూరు: కరువు పీడిత రాయలసీమను సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతో 6 లక్షల ఎకరాలకు నీరు ఇవ్వాలన్న లక్ష్యంతో దివంగత నేత వైఎస్సార్ హంద్రీ-నీవా ప్రాజెక్టును చేపట్టి దాదాపు 90 శాతం పనులను తన హయాంలోనే పూర్తి చేయించారు. కాలువలో జలాలు పారడంతో ఆ మార్గంలోని భూముల్లో నీటి లభ్యత పెరిగి బోరు బావుల్లో నీరు సమృద్ధిగా లభించేవి. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్ హంద్రీ-నీవా కాలువ సామర్థ్యాన్ని 83 టీఎంసీలకు పెంచుతూ అనుమతులు ఇచ్చారు. కానీ ఎన్నికల కోడ్ వచ్చే సరికి ఆ పనులు ముందుకు సాగలేదు.

నాసిరకంగా పనులు..
కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు తన సొంత నియోజకవర్గం కుప్పానికి కృష్ణా జలాలను తీసుకెళ్లేందుకు కాలువ లైనింగ్ పనులకు శ్రీకారం చుట్టారు. లైనింగ్ వల్ల బోరు బావుల్లో నీటి లభ్యత తగ్గి భూములు బీళ్లుగా మారే అవకాశం ఉంది. ఈ క్రమంలో లైనింగ్ చేయకూడదని ఒక వైపు రైతులు వాపోతుంటే... కూటమి ప్రభుత్వం మాత్రం 'తమ్ముళ్ల' జేబులు నింపడానికి పనులకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 183 కిలోమీటర్ల మేర చేపట్టాల్సిన పనులను 7 ప్యాకేజీలుగా విభజించింది. 1 నుంచి 5వ ప్యాకేజీ వరకు రూ.936.70 కోట్లు, 6,7 ప్యాకేజీలకు రూ.319 కోట్ల ఖర్చుతో పనులు అప్పగించింది. 1,2,3 ప్యాకేజీలు ఆర్‌వీఆర్ కంపెనీ, 4,5 ప్యాకేజీలు బీఎస్ఆర్ కంపెనీ, 6,7 ప్యాకేజీల పనులు ఎస్ఆర్‌సీ కంపెనీ వాళ్లు దక్కించుకున్నారు.



కాలువ పక్కన అటవీ ప్రాంతంలో కొండను తవ్వి కంకరకు రాళ్లు తీసిన దృశ్యం

ఇష్టారాజ్యంగా పనులు..
హంద్రీ-నీవా లైనింగ్ పనులు నాసిరకంగా జరుగుతున్నాయి. సిమెంట్ తక్కువగా వేయడంతో అప్పుడే ఇసుక, కంకర తేలి కనిపిస్తోంది. పూర్తిగా మిషన్లతో పనులు చేపట్టాల్సి ఉన్నా.. దీనికి విరుద్ధంగా కార్మికులతో చేయిస్తున్నారు. ఇక.. లైనింగ్ పనులకు కాంక్రీట్ వేయాలంటే కంకర తప్పనిసరిగా ఉండాలి. కానీ ఆత్మకూరు మండలంలోని పంపనూరు తండా గ్రామం వద్ద హంద్రీ-నీవా కాలువ పక్కనే మొబైల్ క్రషర్ ఏర్పాటు చేసి కాలువలో ఉన్న రాళ్లతో పాటు పక్కనే ఉన్న అటవీ ప్రాంతంలోని కొండ నుంచి రాళ్లను తరలించి కంకర మిషన్‌లోకి వేస్తున్నట్లు తెలిసింది. దీనికితోడు మొబైల్ క్రషర్‌కు అధికారులు అనుమతి ఇచ్చారా అనేది కూడా తెలియడం లేదు. కొండలోని రాళ్లను ఎలా కంకరగా తయారు చేసి వినియోగిస్తారనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.



నాసిరకంగా లైనింగ్ వేయడంతో కంకర తేలిన దృశ్యం

జేబులు నింపుకోవడానికే..
వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో నిర్మించ తలపెట్టిన గండికోట- గాలేరు నగరి, చిత్తూరు జిల్లాలోని పుంగనూరు బ్రాంచ్‌కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు చేపడితే హంద్రీ-నీవా లైనింగ్‌తో పనే ఉండదు. అయినా.. ఆ ప్రాజెక్టులను రద్దు చేసి కేవలం తమ్ముళ్ల జేబులు నింపడానికి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారనే విమర్శలున్నాయి. హంద్రీ-నీవా కాలువ వెడల్పు చేయకుండా, పిల్ల కాలువలు ఏర్పాటు చేసి నీరు ఇవ్వకుండా లైనింగ్ పనులకు తెరలేపిన చంద్రబాబు ప్రభుత్వ తీరుపై రైతులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. తమకు అన్యాయం చేస్తూ ఎవరి జేబులు నింపడానికి ఇలా చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో తమకు కష్టాలు తప్పవేమో అంటూ భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

భూమి బీడుగా మారుతుంది



నాకు కాలువ పక్కన ఐదెకరాల పొలం ఉంది. ప్రస్తుతం రెండు బోర్లు వేసి పంట సాగు చేస్తున్నా. కాలువకు లైనింగ్ వేస్తే భూమి లోపలికి నీరు ఇంకే అవకాశం ఉండదు. బోర్లు ఎండిపోతాయని భయంగా ఉంది. గతంలో పంటలు పండక వలస వెళ్లేవాళ్లం. వైఎస్సార్ చలువతో కాలువ నీటితో పంటలు పండించుకుంటున్నాం. చంద్రబాబు లైనింగ్ వేసి రైతుల నోట్లో మట్టి కొడుతున్నారు.
– వెంకట నాయక్, పంపనూరు తండా, ఆత్మకూరు మండలం

మళ్లీ వలసలు తప్పవేమో?



గతంలో సాగునీరు లేక వలసలు వెళ్లేవాళ్లం. వైఎస్సార్ పుణ్యమా అని నీరు వచ్చాక ఉన్న ఊర్లోనే వ్యవసాయం చేసుకుంటున్నాం. తాజాగా కాలువకు లైనింగ్ వేస్తున్నారు. లైనింగ్ వేస్తే బోర్లలో నీటి లభ్యత తగ్గుతుంది. ఈ క్రమంలో మళ్లీ వలసలు తప్పవేమో అని భయమేస్తోంది.
– పోలన్న, సింగంపల్లి, ఆత్మకూరు మండలం

రైతులకు అన్యాయం



మా గ్రామస్తులంతా దాదాపు వ్యవసాయం పైనే ఆధారపడి బతుకుతున్నాం. మాకు పంటల సాగు తప్ప ఇంకేమీ తెలియదు. ఇప్పుడు బోర్లు ఎండిపోతే పంటలు పండవు. రైతులకు అన్యాయం చేయడానికే చంద్రబాబు ప్రభుత్వం కాలువకు కాంక్రీట్ వేస్తోంది.
– మన్నల లక్ష్మిదేవి, సింగంపల్లి, ఆత్మకూరు మండలం

ఆదరణ ఓర్వలేకనే ఆరోపణలు

- జగనన్నపై పనిగట్టుకొని బురదజల్లుతున్నారు
- మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై హోంమంత్రి స్పందించరా?
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



విలేకరులతో మాట్లాడుతున్న ఉషశ్రీచరణ్

రొద్దం: ఏ ప్రాంతానికి వెళ్లినా.. ప్రజల నుంచి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న జనాదరణ చూసి ఓర్వలేకనే కూటమి ప్రభుత్వ పెద్దలు ఆయనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ విమర్శించారు. గురువారం సాయంత్రం మండల పరిధిలోని ఎం కొత్తపల్లి గ్రామ పంచాయతీలో 'కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉషశ్రీచరణ్ విలేకరులతో మాట్లాడారు. వైఎస్ జగన్ ఎక్కడకు వెళ్లినా ప్రజలు పోటెత్తుతుండటం అందరం చూస్తూనే ఉన్నామన్నారు. ఆయనకు వస్తున్న జనాదరణ చూసి ఓర్వలేక హోం మంత్రి అనిత ప్రెస్‌మీట్ పెట్టిన జగన్‌పై, వైఎస్సార్‌సీపీపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. శాంతిభద్రలకు విఘాతం కల్పించేందుకు వైఎస్సార్‌సీపీ నేతలు బయటకు వస్తున్నారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో దళిత బాలికపై అత్యాచారం జరిగితే హోంమంత్రిగా ఉండి ఇంత వరకూ స్పందించకపోవడం దారుణమన్నారు. అలాగే ఓ గిరిజన యువతి అదృశ్యమైయిందని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పోలీసులు పట్టించుకోలేదన్నారు. ఐదు రోజుల తరువాత అమ్మాయి శవమై కనిపించిందన్నారు. ఇంతవరకూ బాధిత కుటుంబాలను పరామర్శించి ప్రభుత్వం తరుపున ఆర్థిక సాయం ఏమైనా చేశారా? అని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో ఓ మహిళను టీడీపీ నాయకులు చెట్టుకు కట్టేసి దారుణంగా కొట్టిన ఘటన చూస్తే రాజ్యాంగం ఎక్కడుందని ప్రశ్నించారు. హోం మంత్రిగా మహిళలకు రక్షణ కల్పించాల్సింది పోయి జగన్‌పై బురద జల్లడం పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కురుబ గీతా, మండల కన్వీనర్ బి.తిమ్మయ్య, నాయకులు ఎస్ నారాయణరెడ్డి, సి.నారాయణరెడ్డి, నరేంద్రరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, జెట్టి శ్రీనివాస్‌రెడ్డి, వీరేష్, మాజీ సర్పంచ్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇసుక సరఫరా

- కలెక్టర్ టీఎస్ చేతన్



ఉచిత ఇసుక సరఫరాపై సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్


ప్రశాంతి నిలయం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత ఇసుక పాలసీని పారదర్శకంగా అమలు చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి ఉచిత ఇసుక సరఫరా అమలు కమిటీ సమావేశం జరిగింది. కమిటీ చైర్మన్, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారదర్శకంగా ఉచిత ఇసుక సరఫరాను పటిష్టంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇసుక రవాణా చేసే అన్ని వాహనాలు ఉచిత ఇసుక రవాణా వాహనం అన్న బ్యానర్‌తో ఉండాలన్నారు. అలాగే జీపీఎస్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇసుక సరఫరా కేంద్రాల వద్ద సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. అంతర్ రాష్ట్ర ఇసుక అక్రమ రవాణాను నిరోధించేందుకు పోలీసులు సమన్వయంతో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులలో పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలన్నారు. ఉచిత ఇసుక విధానాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లాలో ఉన్న ఇసుక రీచ్‌లు, ఇసుక తవ్వకాలు తదితర అంశాలపై కలెక్టర్ చర్చించారు. జిల్లాలో ఎక్కడా కూడా అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా జరగకుండా చర్యలు అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సభ్యులతో పాటు ఎస్పీ రత్న, వైస్ చైర్మన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, భూగర్భశాఖ అధికారి పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో వ్యక్తికి రిమాండ్



ముదిగుబ్బ: నల్లమాడ మండలం వంకరకుంట గ్రామానికి చెందిన రాజేష్ అనే వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు .. ముదిగుబ్బకు చెందిన ఓ బాలికపై అత్యాచారం చేసినట్లు మంగళవారం బయటపడిందన్నారు. అదే రోజు అతనిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కొద్ది రోజుల క్రితం బాలికను నమ్మించి మోసం చేసి అత్యాచారానికి పాల్పడినట్లు తెలిపారు. బాలిక గర్భవతి అయినట్లు తెలియడంతో రాజేష్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పీఏబీఆర్ సందర్శన



కూడేరు: పీఏబీఆర్ గేట్లను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

కూడేరు: మండల పరిధిలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(పీఏబీఆర్)ను గురువారం జల్‌శక్తి అభియాన్ సెంట్రల్ వాటర్ కమిషన్ సభ్యులు గౌతమ్, డిప్యూటీ డైరెక్టర్ శంకర్ సందర్శించారు. డ్యాంలో నీటి నిల్వ సామర్థ్యం ఎంత.. ఎక్కడి నుంచి నీరు సరఫరా అవుతోంది.. ఎలా వినియోగిస్తున్నారు తదితర అంశాలపై ఇరిగేషన్ అధికారులతో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఈఈ శశిరేఖ మాట్లాడుతూ డ్యాం కెపాసిటీ 11 టీఎంసీలని పేర్కొన్నారు. తుంగభద్ర, జీడిపల్లి జలాశయాల నుంచి కాలువల ద్వారా, ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురిసి నప్పుడు వరద రూపంలో నీరు వచ్చి డ్యాంలో చేరుతుందని వివరించారు. ఇప్పటి వరకు సుమారు 5.5 టీఎంసీల నీరు నిల్వ ఉంచామన్నారు. సత్యసాయి, అనంతపురం, శ్రీరామిరెడ్డి, ఉరవకొండ తాగునీటి ప్రాజెక్టుల ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లాలో వందలాది గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతున్నట్లు చెప్పారు. ధర్మవరం కుడి కాలువ ద్వారా 49 చెరువులకు నీటిని సరఫరా చేస్తామని తద్వారా ప్రజలకు, రైతులకు తాగు, సాగునీరు అందుతోందన్నారు. డ్యాం వద్ద ఏర్పాటైన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ తయారీకి నీటిని వినియోగిస్తామన్నారు. ప్రస్తుతం అవుట్ ఫ్లో 120 క్యూసెక్కులున్నట్లు కేంద్ర బృందానికి వివరించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈఈలు వెంకటరమణ,ఉదయ సేనయ్,ఏఈఈలు లక్ష్మీదేవి, రామకృష్ణ, ముత్యాలప్ప, శాస్త్రి, గంగమ్మ, వెంకటరమణ, రేణుక పాల్గొన్నారు.

తహసీల్దార్ షాబుద్దీన్ పలాయనం

సాక్షి ఎఫెక్ట్..

పుట్టపర్తి: తహసీల్దార్ షాబుద్దీన్ పలాయనం చిత్తగించారు. 'బదిలీ తహసీల్దార్ మళ్లీ విధుల్లోకి' శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వెంటనే షాబుద్దీన్ బుక్కపట్నం తహసీల్దార్ కార్యాలయం నుంచి జారుకున్నారు. వివరాల్లోకెళితే... బుక్కపట్నం తహసీల్దార్‌గా పనిచేస్తున్న షాబుద్దీన్ ఈ నెల 12న తనకల్లుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇక్కడే డీటీగా ఉన్న నరసింహులుకు పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులిచ్చారు. అయితే రాజకీయ కారణాలతో షాబుద్దీన్ తనకల్లులో జాయిన్ కాలేదు. ఉన్నట్టుండి బుధవారం బుక్కపట్నం తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యక్షమై పనులు చక్కబెట్టారు. అనధికారికంగా ఆయన విధులు నిర్వహిస్తున్న వైనంపై 'సాక్షి'లో కథనం రావడంతో వెంటనే అక్కడి నుంచి జారుకున్నారు. వారం పది రోజుల్లో ఆయన ఏదో ఒక చోట విధుల్లో చేరాలని, లేకపోతే కలెక్టర్ కార్యాలయానికి అటాచ్ చేస్తారని ఉన్నతాధికారులు తెలిపారు.

వెంటాడిన మృత్యువు

- ఉరి వేసుకొని చనిపోయేందుకు యువకుడి యత్నం
- కుటుంబ సభ్యులు కాపాడే యత్నంలో ఇనుప రాడ్ తగిలి మృత్యువాత



జయకుమార్ (ఫైల్)



మృతుడు జయకుమార్

ధర్మవరం అర్బన్: ఓ యువకుడిని మృత్యువు వెంటాడింది. ఉరివేసుకొని చనిపోవాలనుకున్న అతన్ని కుటుంబ సభ్యులు కాపాడారు. అయితే సెకండ్ల వ్యవధిలోనే మృత్యువు మరోరూపంలో తిరిగిరానిలోకాలకు తీసుకెళ్లింది. సీఐ రెడ్డప్ప తెలిపిన వివరాలమేరకు.. ధర్మవరం పట్టణంలోని చంద్రబాబునగర్‌లో నివసిస్తున్న దేవరపల్లి నాగరాజు హోటల్‌లో పనిచేస్తున్నాడు. నాగరాజుకు భార్య, కుమారుడు దేవరపల్లి జయకుమార్ (25), కుమార్తె కోమల ఉన్నారు. ఇద్దరూ మగ్గం నేస్తూ తండ్రికి తోడుగా ఉంటున్నారు. మూడునెలల క్రితం మోటార్ సైకిల్‌పై నుంచి కిందపడి జయకుమార్ కాలికి తీవ్రగాయాలయ్యాయి. అప్పటి నుంచి ఇంట్లోనే ఉంటున్న జయకుమార్ ఇక తాను నడవలేనని, దీంతో పాటు సంపాదన కూడా లేకపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలీక మదనపడేవాడు. ఈ నేపథ్యంలోనే జీవితంపై విరక్తి చెందాడు. ఈనెల 18న తండ్రి నాగరాజు హోటల్‌కు పనికి వెళ్లాడు. తల్లి, సోదరి ఇంటి బయట కూర్చున్నారు. ఆ సమయంలో జయకుమార్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకునే ప్రయత్నం చేస్తుండగా గమనించిన తల్లి వెంటనే జయకుమార్‌ను కాపాడేందుకు ఇంటిలోపలికి వెళ్లారు. కుమారుడిని తల్లిపైకి ఎత్తి పట్టుకుని ఉండగా చెల్లెలు కోమల ఫ్యాన్‌కు ఉన్న చీర ముడి విప్పుతున్న సమయంలో ప్రమాదవశాత్తూ జయకుమార్ తల్లి నుంచి జారిపడి మంచం పక్కనున్న మగ్గం డోలు బిగించే ఇనుప రాడ్డుపై పడ్డాడు. ఆ రాడ్డు తల వెనుక లోపలికి వెళ్లడంతో తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే జయకుమార్‌ను ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని రెడ్డప్ప తెలిపారు.

ద్విచక్ర వాహనం నుంచి రూ.5 లక్షల చోరీ



హిందూపురం: ద్విచక్ర వాహనం సైడ్ బ్యాగులో ఉంచిన రూ.5 లక్షల నగదు చోరీకి గురైన సంఘటన హిందూపురం పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. బాధితుడు చిరంజీవి టూటౌన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు... పట్టణంలోని కోట ప్రాంతనికి చెందిన చిరంజీవి ఫొటోగ్రాఫర్‌గా చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అయితే అన్నదమ్ముల ఆస్తి వ్యవహారం విషయంలో రూ.5 లక్షలు ఇవ్వాల్సి ఉండగా గురువారం చిన్నమార్కెట్ పక్కనే ఉన్న స్టేట్ బ్యాంకుకు వచ్చాడు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో బ్యాంకు నుంచి రూ.5 లక్షలు విత్‌డ్రా చేశాడు. అనంతరం తన ద్విచక్ర వాహనం సైడ్ బ్యాగులో ఉంచి తాళం కూడా వేశాడు. తర్వాత చిన్న మార్కెట్ వద్దకు వచ్చి టీషాపులో తాగేందుకు ఆగాడు. టీ తాగేందుకు పక్కనే ఉన్న షాపు వద్దకు వెళ్లాడు. నలుగురు వ్యక్తులు తన ద్విచక్ర వాహనం వద్ద మాట్లాడుతున్నట్లు కనిపిస్తూనే ఉండటంతో కంగారు పడలేదు. టీ తాగిన తర్వాత నేరుగా వాహనం తీసుకొని తన నివాసం సమీపానికి వెళ్లాడు. అయితే ద్విచక్ర వాహనానికి ఉన్న బ్యాగును చూడగా తాళం పీకేసి ఉండటంతో ఆందోళన చెందాడు. బ్యాగులో చూడగా నగదు కనిపించలేదు. కంగారుగా పరిసరాల్లో పరిశీలించాడు. తిరిగి చిన్న మార్కెట్ వద్దకు వెళ్లి వాహనం వద్ద నిలిచి మాట్లాడిన వ్యక్తులు ఉన్నారేమోనని చూడగా వారు కూడా కనిపించలేదు. పరిసరాల్లో వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో బాధితుడు చిరంజీవి టూటౌన్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి జరిగిన విషయాన్ని వివరించి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఫీజుల మోత



జూన్ వచ్చిందంటే తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరిగెడుతాయి. ప్రైవేటు పాఠశాలల్లో ఇష్టానుసారంగా అడ్డగోలుగా వసూలు చేసే ఫీజులు భయ పెడుతున్నాయి. డొనేషన్లు, పుస్తకాలు, పెన్నులు, నోట్ బుక్‌లు, టైలు అంటూ వేలకు వేలను వసూలు చేస్తూ విద్యను ప్రైవేటు పాఠశాలలు వ్యాపారంగా మార్చేశాయి. దీంతో మధ్య తరగతి ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

- తల్లిదండ్రులపై చదువుల భారం
- విద్యాహక్కు చట్టానికి తూట్లు
- ఆందోళనలో మధ్య తరగతి ప్రజలు

పుట్టపర్తి: జిల్లాలో ప్రైవేటు స్కూళ్లలో తరగతి స్థాయిని బట్టి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి పెద్ద మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారు. నర్సరీ, ఎల్ కేజీకి రూ. 50 వేలు, యూకేజీకి రూ.51వేలు, ఒకటి నుంచి ఐదో తరగతి వరకు రూ.54 వేల నుంచి రూ.72 వేలు, 6 నుంచి 10వ తరగతి వరకు రూ.79 వేల నుంచి రూ.88 వేలు వసూలు చేస్తున్నారు.

మెరుగైన విద్య మాయలో..

తమ పిల్లలను మెరుగైన విద్యను అందించాలనే తల్లిదండ్రుల ఆశలను ప్రైవేటు పాఠశాలల యజమాన్యాలు సొమ్ము చేసుకుంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేటు స్కూళ్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఇష్టారాజ్యంగా పాఠశాలలు ఏర్పాటు చేసి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారు. పాఠశాలలు పునఃప్రారంభం అయిన నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను తమ వైపు ఆకర్షించే ప్రయత్నాలను ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ముమ్మరం చేశాయి. ఇటీవల ప్రకటించిన పదో తరగతి ఫలితాలతో పాటు పోటీ పరీక్షల్లో తమ పాఠశాల విద్యార్థులు సాధించిన ప్రగతిని చూపిస్తూ ప్రచార కార్యక్రమాలను హోరెత్తించాయి. పక్కా వ్యూహంతో గత ఏడాది కన్నా ఈ ఏడాది ఫీజులు మరింత పెంచాయి.

పద్నాలుగేళ్ల లోపు విద్యార్థులకు..

పద్నాలుగేళ్ల లోపు విద్యాలందరికీ ఉచిత విద్య అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం విద్యా హక్కు చట్టాన్ని ప్రవేశ పెట్టింది. ప్రైవేటు పాఠశాలల్లోనూ పేద విద్యార్థులకు ఉచిత విద్యనందించాలని నిర్దేశించింది. ఎలాంటి ఫీజు వసూలు చేయకుండా 25 శాతం సీట్లను లాటరీ పద్ధతిలో కేటాయించాలని ఆదేశించింది. ప్రభుత్వ గుర్తింపు లేకుండా ప్రైవేటు పాఠశాలలు ఏర్పాటు చేయకూడదనే నిబంధన ఉంది. అర్హత కలిగిన ఉపాధ్యాయులనే ప్రైవేట్ పాఠశాలల్లో నియమించాల్సి ఉంది. పాఠశాలల్లో కనీస వసతులు కల్పించాలి. కానీ జిల్లాలో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు ఏ పాఠశాలలోనూ కేటాయించడం లేదు. ఎక్కడా లాటరీ పద్ధతిన ప్రవేశాలు లేవు. ప్రైవేటు పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా బహిరంగంగానే ఫీజుల దందాకు తెరలేపినా ప్రశ్నించేవారు లేరు. పాఠశాల అభివృద్ధి, సంక్షేమం, క్రీడలు, పరీక్ష రుసుము, సాంస్కృతిక కార్యక్రమాల పేరుతో యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల యజమాన్యాలతో కలిసి పేరెంట్స్ కమిటీ ఏర్పాటు చేసి, కమిటీ సూచన మేరకు ఫీజులు వసూలు చేయాల్సి ఉన్నా అమలు కావడం లేదు. అన్ని వసతులున్న ప్రైవేటు పాఠశాలల్లో గ్రామీణ ప్రాంతాల్లో రూ.8 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.12 వేలు ఫీజులు వసూలు చేయాలన్న నిబంధనలు అమలు కావడం లేదు. దీంతో పాటు జిల్లాలోని అధిక శాతం ప్రైవేటు పాఠశాలల్లో కనీస వసతులు లేవు. శిక్షణ పొందిన ఉపాధ్యాయుల నియామకం ఎక్కడా అమలు కావడం లేదు.

ఫీజుల వసూళ్లపై నియంత్రణ ఏదీ?

గత ఐదేళ్ల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్యా సంస్కరణలతో ప్రభుత్వ విద్యకు బంగారు బాటలు పడ్డాయి. ఫీజుల నియంత్రణ కమిషన్ ద్వారా ఫీజుల దోపిడీని అరికట్టి పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేలా అప్పటి సీఎం వైఎస్ జగన్ చర్యలు తీసుకున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమవుతూ వచ్చాయి. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ సక్రమంగా అమలు కావడం లేదనే ఆరోపణలూ సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగంగానే యథేచ్ఛగా ఫీజుల దోపిడీ జరుగుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి.

జిల్లాలోని ప్రైవేట్ స్కూళ్లలో డే స్కాలర్ల ఫీజుల వివరాలు ఇలా..

తరగతి	ఫీజు	దుస్తులు	బస్సు	పుస్తకాలు	మొత్తం
ఎల్‌కేజీ	రూ.22 వేలు	రూ.8 వేలు	రూ.10 వేలు	రూ.10 వేలు	రూ.50 వేలు
యూకేజీ	రూ.23 వేలు	రూ.8 వేలు	రూ.10 వేలు	రూ.10 వేలు	రూ.51 వేలు
1వ	రూ.25 వేలు	రూ.9 వేలు	రూ.10 వేలు	రూ.10 వేలు	రూ.54 వేలు
2వ	రూ.25 వేలు	రూ.10 వేలు	రూ.10 వేలు	రూ.10 వేలు	రూ.57 వేలు
3వ	రూ.35 వేలు	రూ.10 వేలు	రూ.12 వేలు	రూ.12 వేలు	రూ.69 వేలు
4వ	రూ.35 వేలు	రూ.10 వేలు	రూ.12 వేలు	రూ.12 వేలు	రూ.69 వేలు
5వ	రూ.37 వేలు	రూ.10 వేలు	రూ.12 వేలు	రూ.13 వేలు	రూ.72 వేలు
6వ	రూ.45 వేలు	రూ.10 వేలు	రూ.12 వేలు	రూ.13 వేలు	రూ.79 వేలు
7వ	రూ.45 వేలు	రూ.10 వేలు	రూ.12 వేలు	రూ.13 వేలు	రూ.79 వేలు
8వ	రూ.48 వేలు	రూ.10 వేలు	రూ.12 వేలు	రూ.13 వేలు	రూ.82 వేలు
9వ	రూ.50 వేలు	రూ.10 వేలు	రూ.12 వేలు	రూ.15 వేలు	రూ.88 వేలు
10వ	రూ.50 వేలు	రూ.10 వేలు	రూ.12 వేలు	రూ.15 వేలు	రూ.88 వేలు

ఇవి కాక హాస్టల్‌కు తరగతిని బట్టి రూ.50 వేల నుంచి రూ.80 వేల వరకు వసూలు చేస్తున్నారు.

ఏడాదిలోనే ఇంత మార్పా?



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు మెరుగుపడ్డాయి. నాణ్యమైన విద్య అందేలా అప్పటి సీఎం వైఎస్ జగన్ చొరవ తీసుకున్నారు. ఇప్పుడా పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే ప్రభుత్వ పాఠశాలలు చాలా అధ్వానస్థితికి చేరుకున్నాయి. దీంతో పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపాల్సి వస్తోంది. అయితే మా అవసరాన్ని ఆసరాగా చేసుకుని పెద్ద మొత్తంలో ఫీజులు అడుగుతున్నారు. ప్రభుత్వం మారిన ఏడాదిలోనే ఇంత మార్పు వస్తుందని అనుకోలేదు.

– శ్యామల, భైరాపురం, కొత్తచెరువు మండలం

ఫీజుల నియంత్రణ ఉండాలి



కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేయడంతో పేద, మధ్య తరగతి పిల్లలు చదువులు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. జిల్లాలో ప్రైవేట్ విద్యా సంస్థలు ముఖ్యంగా నారాయణ, శ్రీచైతన్య లాంటి కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ ఉండేలా ప్రభుత్వ పెద్దలు చొరవ తీసుకోవాలి. గతంలో ఎన్నడూ ఈ పరిస్థితి చూడలేదు. ప్రభుత్వమే ఫీజుల దందాను ప్రోత్సహిస్తున్నట్లుగా కనిపిస్తోంది.

– అదపాల వేమనారాయణ, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు

చర్యలు తీసుకోవాలి



జిల్లాలో అధిక ఫీజులు వస్తున్న ప్రైవేట్ పాఠశాలలు, ముఖ్యంగా నారాయణ, శ్రీచైతన్య లాంటి కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి. విద్యను వ్యాపారంగా మార్చడం రాజ్యాంగ విరుద్ధం. అన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి.

– వేముల అమరనాథరెడ్డి, వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి

క్లుప్తంగా

బెల్టు షాపుల నిర్వాహకుల అరెస్ట్



ముదిరెడ్డిపల్లిలోని దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

హిందూపురం: స్థానిక ముదిరెడ్డిపల్లి ప్రాంతంలో అనధికారికంగా బెల్టు షాపులు నిర్వహిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసి, 30 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ రాజగోపాల నాయుడు తెలిపారు. అందిన సమాచారం మేరకు గురువారం తనిఖీలు చేపట్టామన్నారు. ముగ్గురిని అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించామన్నారు.

నాటు సారా నిర్మూలనకు పటిష్ట చర్యలు : ఎక్సైజ్ డీసీ



సమావేశంలో మాట్లాడుతున్న నాగమద్దయ్య

గుంతకల్లు: ఉమ్మడి జిల్లాలో నాటు సారా నిర్మూలనకు గట్టి చర్యలు తీసుకుంటున్నట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య స్పష్టం చేశారు. గుంతకల్లులోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం అనంతపురం, కర్నూలు జిల్లా సరిహద్దులో నాటు నారా నిర్మూలనకు చేపట్టాల్సిన కార్యాచరణపై కర్నూలు జిల్లా అసిస్టెంట్ కమిషనర్ హనుమంతురావు, ఏఈఎస్ రాజశేఖర్‌గౌడ్, సీఐ శివసాగర్, అనంతపురం స్క్వాడ్ ఇన్‌స్పెక్టర్లు జయనాథరెడ్డి, సుహాసిని, కర్నూలు స్క్వాడ్ ఇన్‌స్పెక్టర్ జయరామ్‌నాయుడుతో కలిసి చర్చించారు. నాటు సారా తయారీ కేంద్రాలపై తరుచూ సంయుక్త దాడులు నిర్వహించాలని తీర్మానించారు. బైండోవర్ కేసుల్లోని వ్యక్తులపై నిఘా మరింత పెంచాలని నిర్ణయించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నల్లచెరువు: ఈ నెల 15న కదిరి రూరల్ కౌలేపల్లి సమీపంలో చోటు చేసుకున్న ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆంజనేయులు(38) గురువారం మృతి చెందాడు. ఈ మేరకు ఎస్ఐ మక్బూల్ బాషా తెలిపారు. నల్లచెరువు మండలం రమణప్పగారిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన ఆంజనేయులు కదిరి పట్టణంలోని ఓ హోటల్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజూ తన ద్విచక్ర వాహనంపై కదిరికి వెళ్లివచ్చేవాడు. ఈ క్రమంలో ఈ నెల 15న రాత్రి హోటల్‌లో పనులు ముగించుకుని స్వగ్రామానికి బయలుదేరిన ఆయన కౌలేపల్లి సమీపంలోకి చేరుకోగానే నియంత్రణ కోల్పోవడంతో అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు కదిరిలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇరు వర్గాలపై కేసుల నమోదు

ధర్మవరం అర్బన్: స్థానిక తారకరామాపురంలోని రామాలయం వద్ద రోడ్డుపై బుధవారం రాత్రి గొడవ పడిన ఇరువర్గాలకు చెందిన పలువురిపై కేసులు నమోదు చేసినట్లు టూ టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. డబ్బుల విషయంగా సాకే మోహన్‌కుమార్, సాకే హరీష్, పురుషోత్తం, సాకే సురేష్.. మరో వర్గమైన కల్లూరి విజయ్‌జేసు, కల్లూరి దివ్య కపిల్, అల్లం దయాసాగర్‌తో గొడవపడి స్థానికులకు ఇబ్బంది కలిగించారు. సమాచారం అందుకున్న పోలీసుల ఇరువర్గాల వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం పరస్పర ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేశారు.

రాష్ట్ర స్థాయి యోగాంధ్ర పోటీల్లో జిల్లా వాసుల ప్రతిభ

ప్రశాంతి నిలయం: ఈనెల 16, 17 తేదీల్లో విజయవాడ వేదికగా నిర్వహించిన యోగాంధ్ర రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లావాసులు వివిధ విభాగాల్లో ప్రతిభ చూపారు. ఈ మేరకు కలెక్టర్ చేతన్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. హిందూపురానికి చెందిన దేవయాని.. సోలో యోగా పోటీల్లో మూడో బహుమతిని దక్కించుకుంది. సింక్రనైజ్డ్ గ్రూప్ పోటీల్లో హిందూపురానికి చెందిన దేవయాని, మమత, శిల్పారాణి, వెంకటేష్.. మూడో బహుమతిని గెలుచుకున్నారు. వ్యాసరచన పోటీల్లో రొళ్లకు చెందిన తనూశ్రీ రెండో బహుమతి, యోగా నినాదాల పోటీల్లో ముదిగుబ్బకు చెందిన రుచిత.. మూడో బహుమతి అందుకున్నారు. ప్రతిభ చాటిన వారిని కలెక్టర్ అభినందించారు.

వివాహిత హత్య కేసులో భర్త అరెస్ట్

రాప్తాడు: వివాహిత హత్య కేసులో భర్తను అరెస్ట్ చేసినట్లు రాప్తాడు పోలీసులు తెలిపారు. వివరాలను గురువారం వెల్లడించారు. అనంతపురంలోని నవోదయ కాలనీకి చెందిన పోకల విజయ్‌కుమార్, ఇటుకలపల్లికి చెందిన బోయ నందిని ప్రేమించి పెళ్లి చేసుకుని రాప్తాడులోని బీసీ కాలనీలో నివాసముంటూ వచ్చారు. కొంత కాలంగా నందిని ప్రవర్తనపై అనుమానాలు పెంచుకున్న విజయ్‌కుమార్ రోజూ మద్యం మత్తులో ఇంటికి చేరుకుని ఆమెతో గొడవపడేవాడు. ఈ నెల 16న నందినితో గొడవ పడి కట్టెతో దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. చుట్టుపక్కల వారు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఈ నెల 17న ఆమె మృతి చెందింది. హతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం పక్కా ఆధారాలతో విజయ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



ప్రమాదానికి గురైన ద్విచక్ర వాహనం

గుత్తి: లారీ ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్ర వాహన చోదకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్నూలు జిల్లా తుగ్గలి మండలం హుసేనాపురం గ్రామానికి చెందిన ఖాసీం (52) తన స్నేహితుడు హరిజన పెద్దయ్యతో కలసి ద్విచక్ర వాహనంపై గురువారం గుత్తికి వచ్చాడు. గుత్తి ఆర్ఎస్‌లోకి చేరుకోగానే వేగంగా దూసుకొచ్చిన లారీ ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనం వెనుక కూర్చొన్న ఖాసీం ఎగిరి రోడ్డుపై పడడంతో అతని తల మీదుగా లారీ చక్కాలు దూసుకెళ్లి అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనపై సీఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బ్యాంకు ఉద్యోగి దుర్మరణం



మృతుడు పార్థసారథి

శెట్టూరు: ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో మరో బైక్‌పై వెళుతున్న బ్యాంక్ ఉద్యోగి దుర్మరణం పాలయ్యారు. శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లికి చెందిన పార్థసారథి (53) శెట్టూరు మండలం ములకలేడులోని యూనియన్ బ్యాంక్ శాఖలో క్యాషియర్‌గా పనిచేస్తున్నారు. కళ్యాణదుర్గంలో నివాసముంటూ రోజూ ద్విచక్రవాహనంపై విధులకు వెళ్లి వచ్చేవారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు కళ్యాణదుర్గం నుంచి తన ద్విచక్రవాహనంలో ములకలేడుకు బయలుదేరారు. శెట్టూరు మండలం అడవిగొల్లపల్లి – యాటకట్లు గ్రామాల మధ్య ప్రయాణిస్తుండగా మలుపులో ఎదురుగా ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చిన కనుకూరు గ్రామానికి చెందిన సత్యప్ప ఢీకొన్నాడు. ఘటనలో రోడ్డుపై పడిన పార్థసారథి తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సత్యప్పతో పాటు ఆయన కుమార్తెకూ తీవ్ర గాయాలయ్యాయి. ఆ మార్గంలో వెళుతున్న వారు గుర్తించి క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పార్థసారథి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ప్రైవేట్ పాఠశాల సీజ్



పాఠశాలను సీజ్ చేస్తున్న ఎంఈఓలు

బత్తలపల్లి: ఎలాంటి అనుమతులు లేకుండా బత్తలపల్లిలో నిర్వహిస్తున్న ఫోనిక్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌ను సీజ్ చేసినట్లు ఎంఈఓలు చాముండేశ్వరి, సుధాకర్‌నాయక్ తెలిపారు. డీఈఓ ఆదేశాల మేరకు గురువారం ఆ పాఠశాలలో తనిఖీలు చేపట్టామన్నారు. అనుమతులు లేనందున సీజ్ చేసినట్లు వివరించారు.

గ్రంథాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ

చిలమత్తూరు: మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ గురువారం తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. పంచాయతీల నుంచి అందాల్సిన సెస్ బకాయిలను వసూలు చేయాలని గ్రంథాలయాధికారి మల్లికార్జునకు సూచించారు. అనంతరం పాఠకులతో మాట్లాడుతూ.. గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పిల్లల హక్కులకు భంగం కలగరాదు

- ఆర్డీఓ సువర్ణ



మాట్లాడుతున్న ఆర్డీఓ సువర్ణ

పుట్టపర్తి అర్బన్: పిల్లల హక్కులకు భంగం కలగకుండా ఉండేందుకు బాల్య వివాహాలను రూపుమాపడంతో పాటు గ్రామాల్లో స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పేలా ప్రత్యేకమైన వ్యవస్థను నిర్మిద్దామంటూ పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి పిలుపునిచ్చారు. బాలల హక్కుల పరిరక్షణ అంశంపై పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో డివిజన్ స్థాయిలోని తహసీల్దార్లు, ఎండీపీఓలు, ఎంఈఓలు, ఎస్ఐలు, శక్తి టీం సభ్యులతో గురువారం వారు సమీక్షించారు. అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే పిల్లలపై జరుగుతున్న లైంగికదాడులను అరికట్టేందుకు వీలవుతుందన్నారు. పిల్లల అవసరాలను సున్నితంగా పరిష్కరించేలా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పోలీస్ స్టేషన్లలో ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఆడ మగ పిల్లల్లో స్నేహ పూర్వక వాతావరణం నెలకొల్పాలన్నారు. గ్రామ బాలల రక్షణ కమిటీలను బలోపేతం చేయడం, ఆన్‌లైన్ దుర్వినియోగాలపై చైతన్య పరచడం వంటి కార్యక్రమాలను విస్తృతం చేయాలన్నారు. హాస్టళ్లలో పిల్లల భద్రత, కౌమార దశలో ఉన్న వారికి డిజిటల్ భద్రతపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ కొండప్ప, డీసీపీఓ మహేష్, సోషల్ వర్కర్ ఆనంద్, యూత్ అంబాసిడర్ సంజు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవకుడు ఫాదర్ ఫెర్రర్



ఫెర్రర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న అన్నే ఫెర్రర్

బత్తలపల్లి: కరువు జిల్లాలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిస్వార్థంగా సేవలు అందించి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ప్రజల్లో హృదయాల్లో ఓ దేవుడిగా ముద్ర వేసుకున్నారని పలువురు కొనియాడారు. ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ ఫెర్రర్ 16వ వర్ధంతి సందర్భంగా బత్తలపల్లిలోని ఆయన ఘాట్‌ను సర్వాంగ సుందరంగా అలంకరించారు. సంస్థలో పని చేస్తున్న వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు ఘాట్‌ను సందర్శించి నివాళులర్పించారు. జిల్లాలో మూడు అధునాతన ఆస్పత్రులను నిర్మించి అన్ని వర్గాలకు వైద్యసేవలు అందించడం, జిల్లా కేంద్రంలో కుటుంబ నియంత్రణ ఆస్పత్రి ఏర్పాటు, బత్తలపల్లిలో ఎయిడ్స్ రోగులకు ఆస్పత్రి ఏర్పాటు తదితర సేవా కార్యక్రమాలకు సంబంధించిన ఛాయాచిత్రాలను ప్రదర్శించారు. కాగా, సంజీవపురం, సూర్యచంద్రాపురం, డి.చెర్లోపల్లి గ్రామాల్లోని ఫాదర్ ఫెర్రర్ విగ్రహాలకు స్థానికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్ బత్తలపల్లిలోని ఫాదర్ ఫెర్రర్ ఘాట్ వద్ద నివాళులర్పించారు. ఘాట్ వద్దకు వచ్చిన పలువురిని ఆప్యాయంగా పలకరించారు. ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ ప్రమీల, మెడికల్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, మెయింటెనెన్స్ మేనేజర్ హనుమంతరెడ్డి, సీబీటీ కాటమయ్యతో పాటు ఆస్పత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.